

# ఎంక్వైరీ కమిషన్ యాక్ట్ కింద జ్యుడీషియల్ కమిషనా?

- జస్టిస్ నర్సింహారెడ్డి పలుమార్లు తన పరిధిని అతిక్రమించారు
- విచారణకు ముందే తప్పు జరిగినట్టు మీడియాతో వ్యాఖ్యలు
- అరకొర వివరాలతో ప్రభుత్వానికి నష్టం వాటిల్లినట్టు చెప్పారు
- హైకోర్టులో కేసీఆర్ తరపున న్యాయవాది ఆదిత్య సోంధి వాదన

హైదరాబాద్, జూన్ 28 (నమస్తే తెలంగాణ): విద్యుత్తు వ్యవహారాలపై రాష్ట్ర ప్రభుత్వం నియమించిన జస్టిస్ ఎల్ నర్సింహారెడ్డి నేతృత్వంలోని కమిషన్ నోటిఫికేషనే చెల్లదని కేసీఆర్ తరపు సీనియర్ న్యాయవాది ఆదిత్య సోంధి స్పష్టం చేశారు. ఎంక్వైరీ కమిషన్ యాక్ట్ కింద జ్యుడీషియల్ కమిషన్‌ను ఎలా నియమిస్తారని ప్రశ్నించారు. విద్యుత్తు వ్యవహారాలపై ఎంవోయూ, విద్యుత్తు కొనుగోళ్లు, థర్మల్ ప్లాంట్ల నిర్మాణంపై ప్రభుత్వం నియమించిన కమిషన్ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నదంటూ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ దాఖలు చేసిన పిటిషన్‌ను విచారణకు చేపట్టే అంశంపై హైకోర్టులో శుక్రవారం వాదనలు ముగిశాయి. పిటిషన్ విచారణకు స్వీకరించేదీ, లేనిదీ సోమవారం ఉత్తర్వులు జారీచేసే అవకాశం ఉన్నది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జూకంటి అనిల్‌కుమార్‌తో కూడిన ధర్మాసనం శుక్రవారం వాదనలు విన్నది. పిటిషనర్ కేసీఆర్ తరపున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది ఆదిత్య సోంధి వాదనలు వినిపించారు. కమిషన్ ఏర్పాటు నోటిఫికేషనే చెల్లదని పేర్కొన్నారు. 'విద్యుత్తుశాఖ ముఖ్య కార్యదర్శి ఎస్ఏఎం రిజ్వీ ఈ ఏడాది మార్చి 14న జారీచేసిన జీవో ఎంఎస్ నంబర్ 9లో కమిషన్స్ ఆఫ్ ఎంక్వయిరీ యాక్ట్ –1952 ప్రకారం జస్టిస్ నరసింహారెడ్డి నేతృత్వంలో జ్యుడీషియల్ కమిషన్‌ను ఏర్పాటు చేస్తున్నట్టు పేర్కొన్నారు. ఎంక్వయిరీ కమిషన్ యాక్ట్ కింద జ్యుడీషియల్ కమిషన్‌ను ఎలా నియమిస్తారు?' అని ప్రశ్నించారు.

### నివేదికలో ఏం ఇవ్వబోతున్నారో చెప్పేశారు

జస్టిస్ నరసింహారెడ్డి కమిషన్ విచారణ పూర్తి చేయకుండానే అసంపూర్తి వివరాలను ఆధారంగా చేసుకుని విద్యుత్తు కొనుగోళ్లు, థర్మల్ ప్లాంట్ల ఏర్పాట్ల వల్ల ప్రభుత్వానికి నష్టం చేకూరిందని మీడియాతో చెప్పడం కూడా తీవ్ర విషయమని సోంధీ వాదించారు. ఈ సమయంలో ప్రధాన న్యాయమూర్తి జోక్యం చేసుకుని.. కమిషన్‌కు న్యాయపరమైన అధికారాలు లేవని, అది సమర్పించే నివేదికకు కట్టుబడి ఉండాలని (బైండింగ్ కాదు కదా) కూడా లేదని, కేవలం నిజనిర్ధారణ నివేదికను మాత్రమే ఇస్తుందని, ఈ వ్యవహారంపై అభ్యంతరం ఏముంటుందని ప్రశ్నించారు. దీనిపై సోంధి స్పందిస్తూ 'నిజ నిర్ధారణ చేయాల్సిన కమిషన్ విచారణ పూర్తి చేయకుండానే భద్రాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లో సబ్ క్రిటికల్ టెక్నాలజీ వినియోగం వల్ల ప్రభుత్వానికి ఇప్పటికే రూ.250 కోట్ల నుంచి రూ.300 కోట్ల వరకు నష్టం వచ్చిందని చెప్పింది. తద్వారా కమిషన్ నివేదిక సమర్పించడానికి ముందే అందులో ఏం ఇవ్వబోయేది వెల్లడించారు' అని పేర్కొన్నారు. కాబట్టి జస్టిస్ నరసింహారెడ్డి కమిషన్‌ను కొనసాగిస్తే ముందే నిర్దేశించిన మేరకు నివేదిక ఇచ్చే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ఆర్థిక అంశాలు, ప్రభుత్వానికి ఆర్థికపరమైన నష్టాలు వంటి విషయాల్లోకి వెళ్లడం ద్వారా విచారణ పరిధిని కమిషన్ అతిక్రమించినట్టేనని చెప్పారు. జస్టిస్ నరసింహారెడ్డి ప్రవర్తన నిష్పక్షపాతంగా లేదని నిరూపణ అవుతున్నదని పేర్కొన్నారు. 'సాక్షులను విచారించి నిజనిర్ధారణ చేయాల్సిన కమిషన్.. విలేకరుల సమావేశం నిర్వహించడం చెల్లదని ఏలేరు స్కాంపై ఏర్పాటైన జస్టిస్ బీకే సోమశేఖర కమిషన్ తీర్పును హైకోర్టు తప్పుపట్టింది' అని గుర్తు చేశారు. ప్రధాన న్యాయమూర్తి మరోసారి కల్పించుకుని, కోట్ల విజయభాస్కర్‌రెడ్డి–ఏపీ ప్రభుత్వం మధ్య జరిగిన కేసులో ఎంక్వయిరీ కమిషన్ విలేకరుల సమావేశాన్ని నిర్వహించలేదు కదా, ఆ కేసు తీర్పును ఉదహరించడాన్ని సమర్థిస్తారా? అని ప్రశ్నించింది. దీనికి ఆదిత్య సోంధి బదులిస్తూ 'జస్టిస్ నర్సింహారెడ్డి ముందుగా పిటిషనర్ వాదనలు వినాల్సి ఉన్నది. పిటిషనర్ చెప్పబోయేది ఏమిటో తెలుసుకోకుండానే ఆర్థిక నష్టాలు, భద్రాద్రి థర్మల్ ప్లాంట్‌ను బొగ్గు గనులకు దూరంగా పెట్టడం వల్ల నష్టాలు, రైలు ట్రాక్ ఇంకా జాప్యం అవుతుందనే అంశాలను బాహాటంగా వెల్లడించడం వల్ల కమిషన్ పని తీరుపై సందేహాలు ఏర్పడుతున్నాయి' అని పేర్కొన్నారు.

### పిటిషన్‌కు విచారణార్హత లేదు

రాష్ట్ర ప్రభుత్వం తరపున అడ్వొకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపించారు. కేసీఆర్ దాఖలు చేసిన పిటిషన్‌కు విచారణార్హత లేదని పేర్కొన్నారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా చేసిన జస్టిస్ ఎల్ నర్సింహారెడ్డి వ్యక్తిగత ప్రతివాదిగా ఉన్నారని, ఆయనకు నోటీసులు జారీ చేసే పరిస్థితులు రాకుడదని చెప్పారు. ఆయనను ప్రతివాదిగా చేర్చడమే చెల్లదని స్పష్టం చేశారు. విచారణ కమిషన్ల నియామకాలపై కోర్టులు జోక్యం చేసుకునేందుకు వీల్లేదని ఏజీ వాదించారు. కోట్ల విజయభాస్కర్‌రెడ్డి–ఏపీ ప్రభుత్వం మధ్య జరిగిన కేసులోనూ హైకోర్టు, సుప్రీంకోర్టు ఇదే రకమైన తీర్పులు ఇచ్చాయని గుర్తుచేశారు. ఈ దశలో ప్రధాన న్యాయమూర్తి కల్పించుకుని ఎంతమందిని సాక్షులను విచారించారు? జస్టిస్ నర్సింహారెడ్డి విలేకరుల సమావేశం నిర్వహించడంపై వివరణ ఇవ్వాలని ఆదేశించారు. 20 నుంచి 23 మంది వరకు సాక్షులను కమిషన్ విచారించిందని, జెన్‌కో, ట్రాన్స్‌కో, ఆ సంస్థల చైర్మన్‌గా చేసిన ప్రభాకర్‌రావు, విద్యుత్తుశాఖ అధికారులను విచారించిందని బదులిచ్చారు. జస్టిస్ నర్సింహారెడ్డి విలేకరుల సమావేశంలో పలానా వాళ్లు తప్పు చేశారనే అభియోగాలు చేయలేదని తెలిపారు. బీహెచ్ఈఎల్‌కు కాంట్రాక్టు ఇచ్చారని, టెండర్ విధానాన్ని అమలు చేయలేదని, విద్యుత్తు నిర్మాణ ప్లాంట్ పూర్తయితే బొగ్గు రవాణాకు నిర్దేశించిన రైలు ట్రాక్ పనులు ఆలస్యం అవుతున్నాయన్న విషయాలు వెల్లడించడం తప్పెలా అవుతుందని ప్రశ్నించారు. నాటి పత్రికలు పరిశీలిస్తే ఆ విషయాలన్నీ తెలుస్తాయని చెప్పారు. కమిషన్ బహిరంగ విచారణ చేస్తున్నందున కొన్ని విషయాలు వెల్లడిస్తే తప్పేమీకాదని పేర్కొన్నారు. తాను విచారణకు సిద్ధమేనని నాటి విద్యుత్తుశాఖమంత్రి ఇటీవల అసెంబ్లీలో ఒప్పుకున్నారని గుర్తుచేశారు. రామకృష్ణ దాల్మియా–కర్ణాటక మధ్య జరిగిన కేసులో సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం.. 'కమిషన్ నిజ నిర్ధారణ నివేదికను మాత్రమే ఇస్తుంది. ఆ నివేదికతో సంతృప్తి చెందకపోతే న్యాయపోరాటం చేసుకునే వెసులుబాటు పిటిషనర్‌కు ఉంది' అని పేర్కొన్నారు. ఆదిలోనే కమిషన్ విచారణను నిలుపుదల చేయాలని కోరడం చట్ట వ్యతిరేకమని ప్రకటించాలని సుదర్శన్‌రెడ్డి ధర్మాసనాన్ని కోరారు.

## ఉద్యోగాల కోసం త్వరలో రాష్ట్ర బంద్

- సన్నాహాలు చేస్తున్న నిరుద్యోగులు
- గాంధీ ఐసీయూలోకి మోతీలాల్ తరలింపు
- నిరుద్యోగ సమాఖ్య గౌరవ అధ్యక్షుడు రాజారామ్ యాదవ్ పరామర్శ

హైదరాబాద్, జూన్ 28 (నమస్తే తెలంగాణ) : ఉద్యోగాల కోసం త్వరలోనే రాష్ట్ర బంద్‌కు పిలుపుఇవ్వబోతున్నట్టు నిరుద్యోగులు తెలిపారు. నిరుద్యోగుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ద్వంద వైఖరికి నిరసనగా బంద్ చేపడుతామని, అందుకు సన్నాహాలు చేస్తున్నట్టు వెల్లడించారు. రాష్ట్రంలో తాము అధికారంలోకి వస్తే 2 లక్షల ఉద్యాగాలు ఇస్తామని, జాబ్ క్యాలండర్ ప్రకటించి అందరికీ న్యాయం చేస్తామని మాట ఇచ్చి, పచ్చి మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రలు తెలిసిపోయాయని నిరుద్యోగులు మండిపడ్డారు. ఉద్యోగాల సాధన కోసం గాంధీ దవాఖానలో ఐదు రోజులుగా ఆమరణ నిరాహార దీక్ష కొనసాగిస్తున్న ఓయూ విద్యార్థి మోతీలాల్ నాయక్‌ను శుక్రవారం విద్యార్థి, నిరుద్యోగ సమాఖ్య గౌరవ అధ్యక్షుడు రాజారామ్ యాదవ్ పరామర్శించారు. దీక్ష చేస్తున్న మోతిలాల్‌కు, నిరుద్యోగులు చేస్తున్న ఉద్యమాలకు బాసటగా నిలుస్తామని ఆయన భరోసా ఇచ్చారు. మోతిలాల్ దీక్షకు రోజు రోజుకు అన్ని వర్గాల వారి నుంచి మద్దతు పెరుగుతుంది. అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే సీఎం రేవంత్‌రెడ్డి నిరుద్యోగుల వ్యతిరేకిగా మారారని నిరుద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మోతీలాల్ దీక్షతో ఆరోగ్యం క్షీణిస్తున్నదని, వైద్యులు ఐసీయూకు తరలించి చికిత్స అందిస్తున్నారని, అయినా రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమని పేర్కొన్నారు.

## గ్రూప్స్ పోస్టుల సంఖ్యను పెంచాలి

- 25వేల టీచర్ పోస్టులను భర్తీ చేయాలి
- సీఎస్‌కు రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య వినతి

హైదరాబాద్, జూన్28 (నమస్తే తెలంగాణ): గ్రూప్స్ పోస్టుల సంఖ్యను పెంచాలని, టీచర్ పోస్టులను కూడా 25వేలకు పెంచాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య డిమాండ్ చేశారు. ప్రభుత్వ ప్రధానకార్యదర్శి శాంతికుమారిని సెక్రటేరియట్‌లో శుక్రవారం ప్రత్యేకంగా కలిసి వినతి పత్రం అందజేశారు. కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు 2లక్షల ఉద్యోగాలు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ కోటా పోస్టులను లెక్కిస్తే గ్రూప్–1 సర్వీస్ 1600, గ్రూప్–2 సర్వీస్ 2200, గ్రూప్3 పోస్టులు 8500 ఉంటాయని, ప్రస్తుత నోటిఫికేషన్‌లో పోస్టుల సంఖ్యను పెంచి, భర్తీ చేయాలని కోరారు. పీఆర్సీ రిపోర్టు ప్రకారం 25 వేల టీచర్ పోస్టులున్నా, కేవలం 11వేలను భర్తీ చేస్తున్నట్టు వాపోయారు. వెయిటింగ్ లిస్టు పద్ధతిని అమలు చేయాలని, దీంతో పోస్టులు మిగిలిపోకుండా భర్తీ అవుతాయని వెల్లడించారు. ఇప్పటికే అన్నిశాఖల్లో అడ్‌హక్ ప్రమోషన్లతో భర్తీ చేశారని, కొందరు ఉన్నతాధికారులు డైరెక్టు రిక్రూట్‌మెంట్ లెక్కించడంలో అన్యాయం చేస్తున్నారని వివరించారు. ఆయా అంశాలను సమగ్రంగా పరిశీలించి చర్యలు తీసుకోవాలని సీఎస్‌కు విజ్ఞప్తి చేశారు. కృష్ణయ్య వెంట గుజ్జ కృష్ణ, గోరేగే మల్లేశ్‌యాదవ్, వేముల రామకృష్ణ, మోదీరాందేవ్ తదితరులున్నారు.

### చందాలతో రోడ్డేసుకున్నరు!



కోస్గి, జూన్ 28 : సీఎం రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గమైన కొడంగల్‌లోని ఓ పల్లె రోడ్డు సౌకర్యానికి నోచుకోలేదు. మహబూబ్‌నగర్ జిల్లా కోస్గి మండలం తోగాపూర్ పంచాయతీ పరిధిలోని పందిరి హన్మండ్లు గ్రామానికి సరైన రోడ్డు సౌకర్యం లేదు. గ్రామానికి వెళ్లే 2 కిలోమీటర్ల రహదారి గుంతలమయంగా మారింది. ఇంటికి రూ.2 వేల చొప్పున చందాలు వేసుకొని రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్లను తొలగించారు. ట్రాక్టర్లతో మట్టిని తెచ్చి పోసుకున్నారు. సీఎం స్పందించి గ్రామానికి రోడ్డు మంజూరు చేయాలని గ్రామస్థులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## జూలై 18 నుంచి డీఎస్సీ

మొదటిపేజీ తరువాయి...

రీషెడ్యూల్ చేసింది. జూలై 18 నుంచి ఆగస్టు 5 వరకు పరీక్షలను నిర్వహించనున్నట్టు తెలిపింది. పేపర్ల వారీగా పరీక్షల షెడ్యూల్‌ను వెబ్‌సైట్‌లో పొందుపరిచింది. రోజుకు రెండు సెషన్లలో సీబీటీ విధానంలో పరీక్షలను నిర్వహించనున్నారు. 18న స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ సైన్స్, బయోలాజికల్ సైన్స్‌తో మొదలు కానున్న పరీక్షలు ఆగస్టు 5న నిర్వహించనున్న స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ డైరెక్టర్, హిందీ పండిట్ పరీక్షలతో ముగియనున్నాయి. మొత్తంగా 26 రోజుల పాటు ఈ పరీక్షలను నిర్వహించనున్నట్టు విద్యాశాఖ షెడ్యూల్‌ను వెల్లడించింది. జూలై 18,20, 22, 24, 25, 30, 31, ఆగస్టు 1, 2 తేదీల్లో స్కూల్ అసిస్టెంట్ పరీక్షలు ఉంటాయి. జూలై 18, 26న పీఈటీ, జూలై 26, ఆగస్టు 2, 5 తేదీల్లో లాంగ్వేజ్ పండిట్, ఆగస్టు 5 పీడీ, జూలై 19, 22, 23, 26, ఆగస్టు 1 తేదీల్లో ఎస్జీటీ, జూలై 20న స్పెషల్ ఎడ్యుకేషన్ (ఎస్జీటీ, ఎస్ఏ) పరీక్షలు ఉంటాయని విద్యాశాఖ తెలిపింది.

### డీఎస్సీని వాయిదా వేయాలని నిరసన



డీఎస్సీని 45 రోజులపాటు వాయిదా వేయాలని అభ్యర్థులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని సెంట్రల్ లైబ్రరీ వద్ద నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో పదోన్నతులతో ఏర్పడిన దాదాపు 10 వేల ఖాళీలను ఈ డీఎస్సీలోనే కలిపి మెగా డీఎస్సీగా వేయాలని డిమాండ్ చేశారు. లేదంటే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. – ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్

### ఉపాధ్యాయుల కోసం రోడ్డెక్కిన విద్యార్థులు



మెదక్ జిల్లా చిన్నశంకరంపేట మండలం శాలిపేట జడ్పీ ఉన్నత పాఠశాల ప్రారంభమై 15 రోజులు గడుస్తున్నా సరిపడా ఉపాధ్యాయులు లేకపోవడంతో ఆగ్రహించిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు శుక్రవారం పాఠశాల ఎదుట గవ్వలపల్లి–రామాయంపేట ప్రధాన రహదారిపై రాస్తారోకో చేశారు. ఎంఈవో బుచ్చయ్యనాయక్, కాంప్లెక్స్ హెచ్ఎం భాస్కరరావు పాఠశాలకు వెళ్లి 15 రోజుల్లో ఉపాధ్యాయులను పంపిస్తామని తెలిపారు. – చిన్నశంకరంపేట

## ఒకే సీనియారిటీ లిస్ట్

- దాని ప్రకారమే స్థానికేతర టీచర్లకు బదిలీలు
- ఎస్సీ గురుకులాల సొసైటీ సెక్రటరీ వర్షిణి
- గురుకుల ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో భేటీ



ఎస్సీ గురుకుల సంస్థల్లోని ఉద్యోగ,ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులతో శుక్రవారం సమావేశమైన సొసైటీ కార్యదర్శి వర్షిణి

హైదరాబాద్, జూన్28 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో 317 జీవో ప్రకారం డిస్ట్రిక్, జోనల్, మల్టీజోనల్ వారీగా టీచర్లకు సంబంధించిన ఒకే సీనియార్టీ లిస్టును ప్రకటిస్తామని ఎస్సీ గురుకులాల సొసైటీ కార్యదర్శి వర్షిణి తెలిపారు. ఈ జాబితా ప్రకారం స్థానికేతర ఉపాధ్యాయులను కౌన్సెలింగ్‌కు పిలిచి బదిలీ చేస్తామని వెల్లడించారు. 317 జీవో అమలులో ఉన్న సందేహాలను నివృత్తి చేసేందుకు ఎస్సీ గురుకుల సంస్థలోని ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులతో సెక్రటరీ శుక్రవారం ప్రత్యేకంగా భేటీ అయ్యారు. సీనియార్టీ జాబితా, బదిలీ తదితర అంశాలపై ఆయా సంఘాల ప్రతినిధులతో సుదీర్ఘంగా చర్చించారు. అన్ని సూచనలను పరిగణనలోకి తీసుకున్న తరువాతే ఫైనల్ వేకెన్సీ లిస్టును ప్రకటిస్తామని తెలిపారు. వెబ్ కౌన్సిలింగ్ ద్వారా కాకుండా ప్రత్యక్ష పద్ధతి ద్వారా బదిలీ ప్రక్రియ కొనసాగుతుందని పేర్కొన్నారు. స్పౌజ్, మెడికల్, వ్యక్తిగత కారణాలన్నింటినీ కౌన్సెలింగ్‌లో పరిగణనలోకి తీసుకుని తగు న్యాయం చేస్తామని కార్యదర్శి వర్షిణి హామీ ఇచ్చారు. కోర్టు కేసుల్లో ఉన్నటువంటి వారికి కూడా వారి గ్రీవెన్స్ ఆధారంగా బదిలీ చేస్తామని వెల్లడించారు. ఈ సందర్భంగా కార్యదర్శి వర్షిణి, ఇతర అధికారులకు గురుకుల ఉద్యోగులందరి తరపున టిగారియ (తెలంగాణ ప్రభుత్వ రెసిడెన్షియల ఇన్‌స్టిట్యూట్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్) అధ్యక్షుడు మామిడి నారాయణ, జనరల్ సెక్రటరీ డాక్టర్ మధుసూదన్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గణేశ్, భిక్షంయాదవ్, తెలంగాణా సాంఘిక సంక్షేమ గురుకుల ఉపాధ్యాయ, ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు బాలరాజు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దయాకర్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

### ఆరు నెలలుగా జీతాలివ్వకుంటే ఎట్లా?



ఆర్నెల్లుగా వేతనాలు చెల్లించకపోవడాన్ని నిరసిస్తూ పారిశుద్ధ్య కార్మికులు, సిబ్బంది శుక్రవారం నిజామాబాద్ జిల్లా రెంజల్ మండలంలోని నీలా గ్రామ పంచాయతీ ఎదుట నిరసన తెలిపారు. జీతాలు లేక కుటుంబ పోషణ భారంగా మారిందని ఆవేదన వ్యక్తంచేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే నిధులు విడుదల చేసి తమకు వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేకపోతే వినూత్న రీతిలో నిరసనలు చేపడతామని హెచ్చరించారు. నిరసనలో భాగంగా వంటావార్పుకు సిద్ధమవుతుండగా, అధికారులు అడ్డుకున్నారు. – రెంజల్

## టీచర్ బదిలీ.. వెక్కివెక్కి ఏడ్చిన విద్యార్థులు

బొమ్మలరామారం/ మద్దిరాల, జూన్ 28 : యాదాద్రి భువనగిరి జిల్లా బొమ్మలరామారం మండలం సోమాజిపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 12 సంవత్సరాలుగా ఎస్జీటీగా పనిచేస్తున్న కోట ప్రదీప్‌కన్నా ఇటీవల ప్రమోషన్‌పై రాజాపేట మండలం బేగంపేట జడ్పీహెచ్ఎస్‌కు స్కూల్ అసిస్టెంట్ బయోసైన్స్‌గా బదిలీ అయ్యారు. శుక్రవారం పాఠశాలలో వీడ్కోలు సమావేశం నిర్వహించగా.. తమ పాఠశాల విడిచి వెళ్లొద్దని ఉపాధ్యాయుడిని విద్యార్థులు పట్టుకొని వెక్కి వెక్కి ఏడ్చారు. సూర్యాపేట జిల్లా మద్దిరాల మండలం పోలుమల్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో భాషా పండితుడిగా పనిచేస్తున్న మెంతబోయిన సైదులు బదిలీపై స్కూల్ నుంచి వెళ్తుండగా.. వెళ్లిపోవద్దు సార్ అంటూ విద్యార్థులు ఉపాధ్యాయుడి కాళ్ల మీద పడి వేడుకున్నారు.



ఉపాధ్యాయుడు ప్రదీప్‌కన్నాను పట్టుకొని ఏడుస్తున్న విద్యార్థులు

## ప్రతిభా..సామాజిక సమతూకమా?

**వీసీల నియామకాలపై ప్రభుత్వం తర్జనభర్జన**

హైదరాబాద్, జూన్ 28 (నమస్తే తెలంగాణ): వర్సిటీలకు వైస్‌చాన్స్‌లర్ల నియామకాల్లో సామాజిక సమీకరణాలకు ప్రాధాన్యమివ్వాలా? లేక ప్రతిభకా? అన్నది ప్రభుత్వం తేల్చుకోలేకపోతున్నది. కాకతీయ వర్సిటీ మినహా 9 వర్సిటీలకు ప్రభుత్వం సెర్చ్ కమిటీలను ఏర్పాటు చేసింది. నెల రోజులు పూర్తయినా కమిటీ సమావేశాలకు షెడ్యూల్ ఖరారుకావడంలేదు. దీంతో వీసీల నియామకం మరింత ఆలస్యమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. జేఎన్టీయూ, ఉస్మానియా యూనివర్సిటీలపైనే పీటముడి నెలకొన్నది. ఒక వర్సిటీని ఓసీకి, మరో వర్సిటీని ఎస్సీ లేదా ఇతర సామాజిక వర్గాలకు కేటాయిస్తారన్న వాదనలున్నాయి. ఈ రెండు తేలితేనే మిగతా వాటిపై స్పష్టత వస్తుంది. 10 వర్సిటీల వీసీల నియామకానికి జనవరి 27న ప్రభుత్వం నోటిఫికేషన్‌ను జారీచేసింది. 312 మంది దరఖాస్తు చేసుకోగా, 1,382 దరఖాస్తులొచ్చాయి. మే 21తో వీసీల పదవీకాలం ముగిసిపోగా 10 మంది ఐఏఎస్ అధికారులకు ప్రభుత్వం ఇన్‌చార్జి వీసీలుగా బాధ్యతలు అప్పగించింది.

## బదిలీకి సెర్ప్ ఉద్యోగుల ఎదురుచూపు

- ఒకేచోట ఏండ్ల నుంచి సిబ్బంది విధులు
- కౌన్సెలింగ్ ద్వారా బదిలీకి డిమాండ్

హైదరాబాద్, జూన్ 28 (నమస్తే తెలంగాణ) : గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) ఉద్యోగులు బదిలీల కోసం ఎదురు చూస్తున్నారు. గత పదేండ్లుగా బదిలీలు లేకపోవడంతో ఎక్కడివారు అక్కడే ఉండిపోయారు. ప్రతి ఐదేండ్లకొకసారి బదిలీలు జరగాల్సి ఉండగా, కొత్త జిల్లాల ఏర్పాటు, ఉద్యోగులను జిల్లాల వారీగా విభజించడం, ఎన్నికల కోడ్, కరోనా మహమ్మారి తదితర కారణాలతో ఇన్నాళ్లు బదిలీలు జరగలేదు. ఇప్పటి వరకు ఈ ప్రక్రియ అంతా పూర్తి కావడంతో వెంటనే బదిలీలు చేపట్టాలని సెర్ప్ ఉద్యోగులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. రాష్ట్రంలో 4 వేల మంది ఉద్యోగులు సెర్ప్‌లో పనిచేస్తున్నారు. వీరిలో ఎక్కువ సంఖ్యలో కమ్యూనిటి కోఆర్డినేటర్లు(సీసీ), అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్లు (ఏపీఎం) ఉన్నారు. వీరితో పాటు డీపీఎంలు, అడ్మిన్ అసిస్టెంట్‌లు, ఎంబీకేలు, మండల సమాఖ్య కోఆర్డినేటర్లు, మినిస్టీరియల్ సిబ్బంది ఉన్నారు. వీరంతా బదిలీలు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్నారు. అత్యధిక సంఖ్యలో ఉండే సీసీలు తమ సొంత మండలాల్లోనే విధులు నిర్వర్తిస్తున్నారు. దీంతో వీరు అవినీతి, అధికార దుర్వినియోగం, వివక్ష చూపుతున్నారంటూ స్థానికంగా అనేక ఫిర్యాదులు ఉన్నాయి. సొంత మండలాల నుంచి వారిని బదిలీ చేయాలనే డిమాండ్ ఉన్నది. వీరితో పాటుగా ఏపీఎంలు సుదీర్ఘ కాలం ఒకే దగ్గర పనిచేస్తున్నారు. వీరికి గత కొన్నేండ్లుగా బదిలీలు జరగలేదు. వెంటనే బదిలీలపై నిషేధం ఎత్తివేసి, కౌన్సెలింగ్ ద్వారా బదిలీలు చేపట్టాలని కోరుతున్నారు.

### బకాయిలు చెల్లించాలని పాడి రైతుల ఆందోళన



పాల బిల్లులు చెల్లించడం లేదని పాడి రైతులు కన్నెర్ర చేశారు. శుక్రవారం మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ మండలం బోయిన్‌పల్లిలో గ్రామ వద్ద జడ్చర్ల–కల్వకుర్తి రహదారిపై వివిధ పార్టీల నాయకులతో కలిసి ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ రెండు నెలలుగా డబ్బులు ఇవ్వకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నట్టు పేర్కొన్నారు. పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.బిల్లుల విషయంలో రైతులు ఆందోళన చెందవద్దని, బకాయిలను త్వరలో చెల్లిస్తామని తెలంగాణ స్టేట్ డెయిరీ డెవలప్‌మెంట్ కో–ఆపరేటివ్ ఫెడరేషన్ తెలిపింది – మిడ్జిల్

## టీచర్ల పదోన్నతుల్లోనూ రీలింక్విష్‌మెంట్

- రెండు, మూడు పదోన్నతులొచ్చిన స్థానంలో ఇతరులకు అవకాశం
- రంగారెడ్డి జిల్లాలో పదోన్నతులకు పచ్చజెండా

హైదరాబాద్, జూన్ 28 (నమస్తే తెలంగాణ): టీచర్ల పదోన్నతుల్లోనూ రీలింక్విష్‌మెంట్‌ను పాటించాలని విద్యాశాఖ నిర్ణయించింది. పదోన్నతుల్లో ఒకే టీచర్‌కు రెండు, మూడు దక్కాయి. కానీ ఆఖరుకు ఒక టీచర్ ఒకే పదోన్నతిని ఎంపిక చేసుకొని విధుల్లో చేరారు. దీంతో వారు పొందిన మిగతా పోస్టులు మళ్లీ బ్యాక్‌లాగ్ అయ్యాయి. ఇలాంటివి రాష్ట్రంలో 600 వరకు ఉంటాయని అధికారులు ప్రాథమిక నిర్ణయానికి వచ్చారు. ఆయా పోస్టులను సీనియార్టీ జాబితాలో ఉన్న వారితో భర్తీ చేయాలని ఉపాధ్యాయ సంఘాలు కోరాయి. ఈ నేపథ్యంలో రీలింక్విష్‌మెంట్‌ను అమలు చేయాలని నిర్ణయించారు. తాజా షెడ్యూల్లోనే ఇతరులతో నింపుతామని విద్యాశాఖ ఉన్నతాధికారులు తెలిపారు. నిలిచిపోయిన రంగారెడ్డి జిల్లా టీచర్ల బదిలీలు, పదోన్నతులను ఇదే షెడ్యూల్లో పూర్తిచేయాలని గురువారం హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులిచ్చింది. తుది తీర్పు వచ్చేవరకు ఆయా సబ్జెక్టుల్లో 40 పోస్టులను ఖాళీగా ఉంచాలని స్పష్టం చేసింది. సోమవారం నుంచి వారం రోజుల్లో బదిలీలు చేపట్టాలని అధికారులు భావిస్తున్నారు. రంగారెడ్డి జిల్లాలో ఇప్పటికే హెచ్ఎం పదోన్నతులు పూర్తయ్యాయి. రెండు రోజుల పాటు స్కూల్ అసిస్టెంట్ల బదిలీలు చేపడతారు. ఆ తర్వాత మరో రెండు రోజుల్లో సెకండరీ గ్రేడ్ టీచర్లకు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పిస్తారు. ఆ తర్వాత మూడు రోజుల్లో సెకండరీ గ్రేడ్ టీచర్ల బదిలీలు చేపట్టాలని నిర్ణయించారు.

## టీచర్ జాతీయ అవార్డులకు దరఖాస్తులు

హైదరాబాద్, జూన్ 28 (నమస్తే తెలంగాణ): జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల కోసం కేంద్రప్రభుత్వం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది. జిల్లా పరిషత్, మండల పరిషత్, ఎయిడెడ్ పాఠశాలల ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు 2024 సంవత్సరానికిగానూ జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కేంద్ర పాఠశాల విద్యామంత్రిత్వశాఖ శుక్రవారం ఒక ప్రకటనలో కోరింది. దరఖాస్తులను http//nationalawardstoteachers.education.gov.in ద్వారా వచ్చే నెల 15లోగా పంపించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించింది.

### తాగునీటి కోసం రోడ్డెక్కిన మహిళలు




రెండు నెలలుగా తాగునీరు రావడం లేదని ఆరోపిస్తూ ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం పైనంపల్లికి చెందిన మహిళలు, యువకులు ఖమ్మం–కోదాడ రహదారిపై శుక్రవారం ఖాళీ బిందెలతో రోడ్డుపై కూర్చొని నిరసన తెలిపారు. పోలీసు అధికారులు చేరుకుని సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో మహిళలు ఆందోళన విరమించారు. – కూసుమంచి